

బంద్ ప్రశాంతం


చిత్తూరులో..

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పుంగనూరు ఘటనల నేపథ్యంలో వైసిపి పిలుపు మేరకు శనివారం జిల్లా కేంద్రమైన చిత్తూరులో చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం ఆరు గంటల నుండి వైఎస్సార్‌సిపి శ్రేణులు గాంధీ విగ్రహం వద్దకు చేరుకొని నల్లకండువాలతో నిరసన వ్యక్తం చేశారు. బంద్‌కు సహకరించాలని ప్రజలను కోరారు. బస్సులు, భారీ వాహనాలు రాకపోకలు ఆగిపోయాయి. వాణిజ్య దుకాణాలు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. వైసిపికి చెందిన నాయకులు, కార్యకర్తలు ద్విచక్రవాహనాల్లో నగరంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అమరాజ్ బ్యాటరీస్‌కు చెందిన బస్సును అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు కొంగారెడ్డి పల్లె వద్ద అడ్డుకొని బస్సులను సిబ్బందిని క్రిందకు దింపి బస్సు అద్దాలను పగుల గొట్టారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డిఐజి అమ్మిరెడ్డి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పోలీసులను పరామర్శించారు. నగరంలోని పలుచోట్ల టిడిపి అధినేత చంద్రబాబు దిష్టిబొమ్మలను తగులబెట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చిత్తూరు డిఎస్‌పి శ్రీనివాస మూర్తి నేతృత్వంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. గుడిపాల, జీడినెల్లూరు, పూతలపట్టు, ఐరాల, యాదమరి, బంగారుపాళ్యం, తవణంపల్లిలో బంద్ ప్రశాంతంగా సాగింది. నిరసన కార్యక్రమంలో చిత్తూరు ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు, మొదలియార్ సంఘం రాష్ట్ర చైర్మన్ బుల్లెట్ సురేష్, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్, ఎపిఎస్ఆర్‌టిసి వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, వైసిపి నాయకులు భూపేష్, నగర మేయర్ అముద, కార్పొరేటర్లు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలో శనివారం ఉదయం నుంచి వైసిపి కార్యకర్తలు పురవీధుల్లో తిరుగుతూ బంద్ చెప్పటాలని పిలుపు ఇవ్వడంతో దుకాణాలన్నింటిని స్వచ్ఛందంగా మూసివేసి ప్రశాంతంగా నిర్వహించారు. అనంతరం బైక్‌ర్యాలీ నిర్వహించారు. పుంగనూరు డిపో నుండి ఆర్టీసీ బస్సులను కూడా నిలిపివేయడం జరిగింది. మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా, ఎంపిపి ఆకిపాసి భాస్కర్ రెడ్డి, వర్క్ బోర్డ్ చైర్మన్ అమ్ము, మడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, పాల్గొన్నారు.

వి.కోట: వి.కోటలో శనివారం జడ్పీచైర్మన్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా బంద్ నిర్వహించారు. ఎంపిపి యువరాజ్, మండల పార్టీ అధ్యక్షులు బాల గురునాథ్, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిఎస్ నాగరాజ, వైస్ఎంపిపి లక్ష్మణ్ రెడ్డి, తిమింఖాన్, వి.కోట ఉపసర్పంచ్ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో శనివారం బంద్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర పాలఏకిరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్ రాజా, వైస్ఎంపిపి శిరీష్ రెడ్డి, జడ్పిటిసి సోమశేఖర్ పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలో వైసీపీ రాష్ట్ర కన్వీనర్ మొగసాల కష్ణమూర్తి, జిల్లా ఎంపీపీల అధ్యక్షులు, బైరెడ్డిపల్లి ఎంపీపీ మొగసాల రెడ్డప్ప ఆధ్వర్యంలో బంద్ ప్రశాంతంగా నిర్వహించారు.

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలో మెయిన్ రోడ్‌లో శనివారం ఉదయం వైసిపి నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. మాజీ డీసీయంఎస్ చైర్మన్ వేల్మూరు బాబురెడ్డి, వైసిపి మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, రాష్ట్ర గ్రీన్‌ఇండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణారెడ్డి, మాజీ మండల కన్వీనర్ సురేందర్‌రెడ్డి, జిల్లా మామిడి రైతులు యూనియన్ అధ్యక్షులు వెంకటరెడ్డి, సర్పంచ్‌లు మునిరాజారెడ్డి, రవీంద్రారెడ్డి, సొసైటీ వైస్‌చైర్మన్ బాబు నాయుడు, వైస్ఎంపిపి హరిబాబు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలం పచ్చికాపల్లం గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో శనివారం ధర్నా రాస్తారోకో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.


వి.కోటలో..


గంగాధరనెల్లూరులో..

కుప్పం: నియోజకవర్గం కేంద్రంలో వైఎస్సార్‌సిపి నాయకులు బంద్ సందర్భంగా దుకాణాలన్నీ మూసివేశారు. కానీ మందుల షాపులు మాత్రం తెరచి ఉండటంతో అధికారులు సైతం అధికార పక్షం కొమ్ముకాస్తున్నారని, మద్యం షాపులు తెరచి ఉండటం వలన మరింత విధ్వంసాలకు దారి తీసే పరిస్థితి ఏర్పడిందని రాజకీయ విశ్లేషకులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

పలమనేరు: పలమనేరు నియోజకవర్గం వ్యాప్తంగా ప్రజలు, పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా పాల్గొని తమ నిరసన తెలియజేసి బంద్‌ను విజయవంతం చేశారు.

గంగవరం: మండలంలో వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు శనివారం తెల్లవారు జామున 6గంటలకు రహదారులపైకి వచ్చి నిరసన తెలుపుతూ వాహనాలు రాకపోకలను పూర్తిగా అడ్డుకున్నారు. కళాశాలలో, ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలు, హోటళ్లు మూసివేయించారు.

ఎస్ఆర్ పురం: మండల కేంద్రమైన పుల్లూరు క్రాస్ రోడ్డులో శనివారం ఉదయం చిత్తూరు పుత్తూరు జాతీయ రహదారిపై వైసిపి నాయకులు కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. సర్పంచ్ హరిత కుప్పయ్య, జడ్పీటిసి రమణ ప్రసాద్ రెడ్డి, నాయకులు జనార్దన్, హరిరెడ్డి, మునికృష్ణ పాల్గొన్నారు.

సోమల: సదుం, సోమల మండలాలలో ప్రశాంత వాతావరణంలో సంపూర్ణ బంద్ జరిగింది. ఉదయం నుండే వైసిపి నాయకులు కార్యకర్తలు మండలంలో దుకాణాలను, పాఠశాలలు నిర్వహించ కుండా అడ్డుకోవడంతో రెండు మండలాలలో ఎలాంటి వ్యాపార లావాదేవీలు జరగలేదు. పలుచోట్ల బైక్ ర్యాలీలు నిర్వహించారు.

యాదమరి: మండల కేంద్రంలో వైఎస్ఆర్ పార్టీ రాష్ట్ర కన్వీనర్, జిల్లా పరిషత్ జడ్పీ వైస్‌చైర్మన్ బి.ధనంజయ రెడ్డి ఆధ్వర్యంలో చెన్నై బెంగళూరు జాతీయ రహదారిపై ధర్నా రాష్ట్ర నిర్వహించారు. మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు సురేష్‌బాబు, సర్పంచ్ సంఘం మాజీ అధ్యక్షులు మనోహర్ రెడ్డి, యువత అధ్యక్షులు కార్తీక్ పాల్గొన్నారు.

నగరి: ప్రతిపక్షనాయకుడు చంద్రబాబువి రెచ్చగొట్టే రాజకీయాలని మంత్రి ఆర్కేరోజా సోదరులు రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. పుంగనూరులో టీడీపీ శ్రేణులు పోలీసులపైన దాడులకు పాల్పడాన్ని నిరశిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ప్రశాంత జిల్లాబంద్‌లో భాగంగా నగరి మున్సిపాలిటీ, నగరి, నిండ్ర, విజయపురం మండలాలకు చెందిన నాయకులతో కలిసి టవర్‌క్లాక్ సెంటర్‌లో ధర్నాచేశారు. దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదుచేసి చర్యలు చేపట్టాలంటూ సీఐలు శ్రీనివాసంతి, రాజశేఖర్‌లకు వినతిపత్రాలు అందజేశారు.

పెద్దపంజాణి: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు బాగారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది.చెన్నై-ముంబై జాతీయ రహదారిలో పలువాహనాలు భారీసంఖ్యలో రోడ్డుపై నిలిచిపోయాయి. ఎంపిపి రెడ్డెప్ప, వైస్ ఎంపిపిలు జిడి.బాబు, రాష్ట్ర హ్యూమన్ రైట్స్ కమిషన్ సెల్ అధ్యక్షులు యస్.ఆంజప్ప, వైసిపి జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు ఓబుల్ రెడ్డి పాల్గొన్నారు.


బంగారుపాళ్యంలో..

పాలసముద్రం: శనివారం వైఎస్ఆర్సీపీ నాయకులు బలిజ కండ్రిగ జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. అనంతరం చంద్రబాబు నాయుడు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు అనుబంధం, వైస్ఎంపీపీ శేఖర్ యాదవ్, మాజీ మండల అధ్యక్షురాలు ఇందిరమ్మ, రైతుభరోసా చైర్మన్ పోలయ్య, సర్పంచ్ మహేష్ బాబు, అయ్యప్ప, ఎంపీటీసీ గోవిందరాజులు, లిఖిత పాల్గొన్నారు.

రామకుప్పం: మండల పరిధిలోని వైఎస్సార్ కూడలి వద్ద, పోలీసుస్టేషన్ సర్కిల్ వద్ద వైసీపి నేతలు ధర్నా నిర్వహించారు. మండల కన్వీనర్ బాబు రెడ్డి, ఎంపిపి సుబ్రమణ్యం, జడ్పీటిసి నితిన్, కో కన్వీనర్ చంద్ర రెడ్డి పాల్గొన్నారు.



బైరెడ్డిపల్లిలో...

తప్పెవరిది..?

శాంతి భద్రతలు నెలకొల్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది

ప్రజాదృష్టి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పుంగనూరులో శుక్రవారం చెలరేగిన హింస, పోలీసులపై టీడీపీ దాడులు, పోలీసుల లాఠీఛార్జీ, ఉద్రిక్తత, వాహనాలకు నిప్పుపెట్టిన ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. అయితే.. ఎవరికి వారు తమ తప్పులేదని.. ఎదుటి పక్షంపై తోసేసే ప్రయత్నం చేశారు. టీడీపీ, వైసీపీ, పోలీసులు మూడు విభాగాలు కూడా తమ తప్పుకాదని తప్పించుకునే ప్రయత్నం చేశారు. ఇక, బాధితుల విషయానికి వస్తే.. ఈ రెండు పార్టీలతో పాటు పోలీసులు కూడా ఉన్నారు. ఈ ఘటనలో అందరూ బాధితులు గానే మిగిలారు. పోలీసుల లాఠీచార్జీలో టీడీపీ కార్యకర్తలు, టీడీపీ కార్యకర్తలు వేసిన రాళ్ల దాడిలో వైసీపీ కార్యకర్తలు, పోలీసులు కూడా గాయపడ్డారు. టిడిపి వాళ్ళే దాడి చేశారంటూ పోలీసులు, పోలీసులే రెచ్చగొట్టారంటూ టిడిపి నేతలు ఒకరిపై ఒకరు ఆరోపించుకుంటున్నారు. సీసీ కెమెరా పుటేజీలతో 40మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏవన్‌గా టిడిపి పుంగనూరు ఇన్‌చార్జీ చల్లా బాబును చేర్చారు. ఈమేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పోలీసులు చెబుతున్న లెక్కల ప్రకారం 13మంది గాయపడగా 20 నుంచి 30మంది పోలీసులకు స్వల్పగాయాలయ్యాయి. టీడీపీ అధినేత చంద్రబాబు రాయలసీమలో ప్రాజెక్టుల విధ్వంసంపై పోరుబాట పేరుతో యాత్ర చేస్తున్నారు. ఇది ఈనెల 1నుంచి కొనసాగుతోంది. శుక్రవారం చివరి రోజు. ఆయన తొలుత కర్నూలు, తర్వాత సీఎం జగన్ సొంత జిల్లా కడప.. అనంతరం.. తన సొంత జిల్లా చిత్తూరులోనూ పర్యటనకు రెడీ అయ్యారు. అయితే, షెడ్యూల్‌లో భాగంగా పుంగనూరులో రోడ్డు షో, బహిరంగ సభ ప్లాన్ చేశారు. పోలీసులు ఇందుకు నిరాకరించారు. అనుమతి ఇవ్వలేదు. దీంతో టీడీపీ నేతలు, కార్యకర్తలలో పట్టుదల పెరిగింది. 9సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన నాయకుడు, చంద్రబాబు ఎందుకు పుంగనూరుకు రాకూడదని ప్రశ్నించారు. ఇందుకు తోడు వైసీపీ నాయకులు రెచ్చకొట్టే విధంగా ప్రకటనలు చేశారు. బాబును పుంగనూరులో అడుగుపెట్టనివ్వమని ప్రకటించారు. దీంతో టీడీపీ నేతలలో పట్టుదల పెరిగింది. ఏలా అయిన బాబును పుంగనూరుకు తీసుకురావాలని భావించారు.

శుక్రవారం ఉదయం కూడా వైసీపీ రెచ్చకొట్టే ధోరని వీడలేదు. పుంగనూరులో బాబు గోబ్యాక్ అంటూ నల్లజెండాలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. పుంగనూరు అభివద్ధికి బాబు చేసింది ఏమీ లేదన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అభివద్ధిని వివరించారు. దీంతో బాబు పుంగనూరు రావాలని టీడీపీ వాళ్ళు పట్టుపట్టారు. పోలీసులు వీలుకాదన్నారు. బైపాస్ రోడ్డులో భీమగాని పల్లి వద్ద లారీలు, ఇతర వాహనాలను బాబు రాకుండా అడ్డుపెట్టారు. బ్యారికెట్లను ఏర్పాటు చేశారు. దారికి అడ్డంగా పెట్టిన వాహనాలను, బ్యారికెట్లను తొలగించాలని టీడీపీ కార్యకర్తలు పోలీసులను కోరారు. పోలీసులు ఒప్పుకోక పోవడంతో వాగ్వివాదం చోటు చేసుకుంది. ఆ సమయంలో అక్కడికి వైసీపీ కార్యకర్తలు కూడా చేరుకున్నారు. అక్కడ కూడా రెచ్చకొట్టే విధంగా వ్యవహరించారు. వాగ్వాదం జరగడంతో కొందరు రాళ్ళు రువ్వారు. పరస్పరం దాడులు చేసుకున్నారు. పోలీసుల మీద రాళ్ళ పడ్డాయి. పోలీసులు లాఠీఛార్జీ చేశారు. రాళ్లతో కొట్టారు. ఈ గొడవల్లో కొందరు పోలీసుల వాహనాలకు నిప్పుపెట్టారు. రెండు వాహనాలు దెబ్బతిన్నాయి. దీంతో పోలీసులు భాష్పవాయువు ప్రయోగించారు. పరస్పరం జరిగిన దాడుల్లో ఇరు వర్గాలతో పాటు పోలీసులు కూడా గాయపడ్డారు. ఇది మంత్రి పెద్దిరెడ్డి వ్యూహంగా టీడీపీ వాళ్ళు భావిస్తున్నారు. అంగళ్లలో తన మీదనే రాళ్ళ దాడి జరగడం, పుంగనూరులో అడ్డగించడంతో చంద్రబాబు ఆగ్రహం చెందారు. తొలుత చంద్రబాబు ప్రోగ్రాం పుంగనూరులో లేదు. పోలీసులకు ఇచ్చిన షెడ్యూల్ వివరాల్లో.. పుంగనూరు బైపాస్(హైవే) మీదుగా చంద్రబాబు.. చిత్తూరు జిల్లాలోకి ప్రవేశించాలి. అయితే, కర్నూలు, కడప జిల్లాల్లో వచ్చిన స్పందన చూసిన తర్వాత.. పుంగనూరు టీడీపీ నాయకులు ఇక్కడ కూడా పర్యటించాలని చంద్రబాబును కోరారు. దీనికి పోలీసులు అనుమతి నిరాకరించారు. ముందే పర్మిషన్ తీసుకోవాలని సూచించారు. దీనిని టీడీపీ నాయకులు ఖండించి.. మాజీ ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు పర్యటన జరిగి తీరుతుందని తెలిపారు. ఇక, పోలీసుల నుంచి వైసీపీ నాయకులకు సమాచారం అందిందని టీడీపీ నాయకులు చెబుతున్నారు. ఈ క్రమంలో హైవే నుంచి పుంగనూరు సిటీలోకి వస్తున్న చంద్రబాబును రాకుండా చేయాలనే ఉద్దేశంతో పోలీసులు.. టీడీపీ కార్యకర్తలను పుంగనూరులోకి అడుగు పెట్టకుండా చేయాలని వైసీపీ నాయకులు.. ఎవరు అడ్డు వచ్చినా.. పుంగనూరులో చంద్రబాబు రోడ్ షో చేయించాలని టీడీపీ నాయకులు నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే పోలీసులు రహదారిపై తమ వాహనాలు అడ్డు పెట్టి చంద్రబాబు రాకకు రెండు గంటల ముందు నుంచి అడ్డు తగిలారు. దీనిని టీడీపీ కార్యకర్తలు నిలువరించే ప్రయత్నం చేయగా.. పోలీసులు లాఠీ చార్జీ చేశారు. ఇదే అదునుగా వైసీపీ కార్యకర్తలు.. కూడా టీడీపీ కార్యకర్తలపై విరుచుకుపడ్డారు. ఈ క్రమంలో టీడీపీ కార్యకర్తలు రాళ్ల దాడి చేశారు. ఇక, అక్కడ నుంచి వివాదం ముదిరి.. అన్ని పక్షాలు ఎదురు దాడులు చేసుకున్నాయి. ఇదిలావుంటే.. ఈ పరిణామాల నేపథ్యంలో చంద్రబాబు బైపాస్ మీదుగానే చిత్తూరులోకి వెళ్లిపోయారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎవరు ఎక్కడ అయినా పర్యటించవచ్చు. ఇందుకు పోలీసులు అనుమతి ఇవ్వాలి. తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలి. గొడవలు జరిగే అవకాశాలు ఉంటే, ఎదుటి వారికి నచ్చచెప్పాలి. వినకుంటే ముందస్తుగా అదుపులోకి తీసుకోవాలి. హౌస్ అరెస్టులు మామూలే. అయితే పుంగనూరులో పోలీసులు అధికార పక్షానికి కొమ్ముకాయడం, వారు చెప్పినట్లు వినడంతో సమస్య వచ్చింది. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి ఉంటే ఈ గొడవ జరిగేది కాదు. టీడీపీ వాళ్ళు కూడా సంయమనం కోల్పోయారు. అలా చేయాల్సిన పనిలేదు. తాము చెప్పిన విధంగా నడుచుకొనే పోలీసులు ఉన్నపుడు వైసీపీ వాళ్ళు సీనులోకి రాకుండా ఉండాల్సింది. రెచ్చకొట్టే విధంగా వ్యవహరించకుండా ఉండిఉంటే పుంగనూరు రక్తసిక్తం అయ్యేది కాదు. వాహనాలు తగులబడేవి కాదు. శాంతిభద్రతల సమస్య వచ్చేదే కాదు.

- వాడ గంగరాజు,
సిపిఎం చిత్తూరు జిల్లా కార్యదర్శి

పుంగనూరులో ప్రజాస్వామ్యం ఖూనీ

దాడిని ఖండించిన సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశకి- పుంగనూరు: ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఎవరైనా నిరసన తెలిపే హక్కు ఉందని అలాంటి హక్కును పుంగనూరులో అధికారపార్టీ నాయకులు వ్యవహరించిన తీరు బాధాకరమని ఆ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నాలుగు సంవత్సరాలుగా రాష్ట్రంలో జరిగే దాడులు ఒక ఎత్తు అయితే పుంగనూరులో మాత్రం ప్రతిపక్షనేతలను మాట్లాడనీయకుండా, తిరగనీయకుండా చేయడం అధికార పార్టీ జాగీరా అని ప్రశ్నించారు. పుంగనూరులో మొన్న ఒక నాయకుడు ఇంటిపై విచక్షణారహితంగా జరిపిన దాడి మరవకముందే నేడు ప్రతిపక్ష నేత పర్యటన సందర్భంగా వ్యవహరించిన తీరు చూస్తే ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడమేనని అన్నారు. ప్రతిపక్షాలు విమర్శించినా అధికారపక్షం సంమయనం పాటించి ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఎదుర్కోవాలికాని అలా కాకుండా రెచ్చగొడుతూ భౌతికదాడులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లాలో శాంతిభద్రతలు కాపాడడంలో రెండు పార్టీలు హుందాతనంగా వ్యవహరించాలని, ప్రజలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

77వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం జెసి బంగ్లా నుంచి జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ ఆదేశాల మేరకు ఈనెల 15న చిత్తూరు పోలీసు పెరడ్ గ్రౌండ్ నందు నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల నిర్వహణపై వివిధ శాఖాధికారులతో సమన్వయ సమావేశంను ఎంఎస్.టీమ్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఈనెల 15న చిత్తూరు పోలీసు పెరడ్ గ్రౌండ్‌లో నిర్వహించే భారత స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలను సంబంధితా అధికారులు సమన్వయం చేసుకొని ఘనంగా నిర్వహించాడానికి సహకరించాలన్నారు. పోలీస్ పెరేడ్ నిర్వహించే కార్యక్రమాన్ని చిత్తూరు ఆర్డీఓ పరివేశించాలని ఆదేశించారు. గ్రౌండ్ నందు విఐపిలకు సంబంధించి సీటింగ్, స్టేజీపై ఉన్నావారికి స్నాక్స్, జ్ఞాపికలను, విఐపిలకు ఆహ్వానం సంబంధించి ఏర్పాట్లు చేయాలని చిత్తూరు తహశీల్దార్, డిఎస్ఓలను ఆదేశించారు. జిల్లా ప్రగతి గురించి వివిధ శాఖల ద్వారా అభివద్ధిని తెలిపే ప్రసంగ సందేశాన్ని, పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని సమాచార శాఖ డిడిని ఆదేశించారు. పెరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండా, స్టేజ్ డెకరేషన్, సెక్యూరిటీ, పెరేడ్, సంబంధించి ఏర్పాట్లను చేసుకోవాలని పోలీస్ అధికారులకు చేసుకోవాలని పోలీస్‌శాఖ అధికారులకు సూచించారు. వివిధ శాఖలు ఏర్పాటు చేసే స్టాల్స్‌ను, ఆస్తుల పంపిణీకి సంబంధించి డిఆర్డీఏ పిడి ఏర్పాటు చేసుకోవాలన్నారు. వివిధ శాఖలు ఏర్పాటు చేసే శకటాలను సంబంధించి డ్వామా పిడి పర్యవేక్షించాలన్నారు, శకటాలను చిత్తూరు పట్టణంలో ముఖ్య మైన వీధుల్లో ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు. ఆహుతులను ఆకట్టుకునే విధంగా సాంస్కతిక కార్యక్రమాలు వుండాలని, యాంకర్‌తో పాటు పిల్లలకు స్నాక్స్, జ్ఞాపికలను అందజేయాలని విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. మెడికల్ క్యాంపు, సిబ్బందిని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్యఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. గ్రౌండ్‌లో శానిటేషన్, తాగునీరు తాత్కాలిక మరుగుదొడ్లను, ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్, డిపిఓను ఆదేశించారు. వివిధ శాఖల ద్వారా ప్రతిభ కనుబరించిన ఉద్యోగస్తులకు అందించే ప్రశంసాపత్రాలకు సంబంధించి వివరాలను వెంటనే కలెక్టర్ కార్యాలయానికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ, రేణుక, డిఆర్‌డిఎ, పిడిలు, తులసి, జెడ్పీ సిఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీఈఓ విజేంద్రరావు, జిల్లా ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి, డిపిఓ లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ అరుణ, తహశీల్దార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలు కాపాడే పోలీసులపై దాడి క్రూరత్వం

40 మంది అరెస్టు, మరికొందర్ని గుర్తిస్తున్నాం
ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు : డిఐజి అమ్మిరెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: విధి నిర్వహణలో ఉన్న పోలీసులను విచక్షణా రహితంగా బీర్ బాటిల్స్, కర్రలు, రాళ్ళతో దాడిచేసి వారి దేహాన్ని రక్తంతో తడపడం ఎంతో క్రూరత్వమని డిఐజి అమ్మిరెడ్డి తెలిపారు. అనుమతిలేని మార్గంలో రావడానికి ప్రయత్నించి శాంతి భద్రతలకు భంగం కలిగించే ఉద్దేశంతో పోలీసులపై దాడులకు పాల్పడి అల్లర్లు సష్టించిన వారిని ఎవరిని వదిలిపెట్టమని పోలీసులపై దాడులకు పాల్పడిన వారు ఎంతటి వారైన ఉపేక్షించేది లేదు. వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక పోలీస్ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఐజి మాట్లాడుతూ పుంగనూరు ఘటనలపై అనంతపురం డిఐజి, జిల్లా ఎస్పీ శనివారం స్థానిక పోలీస్ అతిథిగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ ముందుగా నిర్ణయించిన మార్గంలో కాకుండా అకస్మాతుగా మార్చుకొని పుంగనూరులోనికి ప్రవేశించాలని ప్రయత్నించి అక్కడ విధి నిర్వహణలో ఉన్న పోలీసులతో గొడవకు దిగి వారి విధులకు ఆటంకం కలిగించి అక్కడ ఉన్న బ్యారికేడ్లను తొలగించారు.

అల్లరి మూకలను అదుపు చేసే క్రమంలో స్వల్పంగా లాఠీఛార్జీ చేయడం జరిగింది. స్వల్ప లాఠీఛార్జీ చేసిన వారు అక్కడి నుండి వెళ్ళకుండా పెద్దపెద్ద రాళ్ళను పోలీసుల పైకి విసిరి ప్రాణాలకు సైతం హాని కలిగించే విధంగా చేస్తూ పోలీసు వాహనాలు ధ్వంసం చేసి వాటికి నిప్పుపెట్టడం జరిగిందని, పోలీస్ డిపార్టుమెంటు నిష్పక్షపాతంగా ఎల్లప్పుడూ ప్రజల ధన, మన ప్రాణాలు కాపాడడానికి శాంతిభద్రతలు కాపాడడానికి నిరంతరం విధులు నిర్వర్తిస్తుంటారు. పోలీసులు ఏ పార్టీకి అతీతం కాదు. కొంత మంది అల్లరి మూకలు పోలీసుల వెంటపడి కర్రలతో దాడి చేశారు ఇది చాలా దురదష్టకరం. జరిగిన ఈగొడవలో పోలీసులు అత్యంత సమన్వయం పాటించి వారి వద్ద ఆయుధాలు ఉన్న కూడా తొందరపాటు చర్యలకు లోనుకాకుండా నియంత్రణతో గాయాలపాలైన కూడా తమ విధినిర్వర్తిస్తూ ప్రజలకు, శాంతిభద్రతలకు ఎటువంటి భంగం కలగకుండా అల్లరి మూకలను కట్టడి చేయడంలో జిల్లా ఎస్పీ, సిబ్బంది అందరు లా అండ్ ఆర్డర్‌ను చక్కగా నిర్వహించారని, ఇంతటి విధ్వంసం జరిగిన పోలీసులకు తీవ్రగాయాలయ్యాయి కాని ప్రజలకు ఎటువంటి గాయాలు కానీ అవ్వలేదని తెలిపారు. జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు కార్యక్రమం ప్రకారం పుంగనూరు లోనికి రావడానికి ఎటువంటి అనుమతి తీసుకోలేదని, ఇచ్చిన కార్యక్రమం ప్రకారమే 400మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసామన్నారు. వారు కార్యక్రమం ప్రకారం పుంగనూరులోనికి రాకుండా హైవే పై చిత్తూరుకు వెళ్ళవలసి ఉందని, శాంతి భద్రతలను దష్టిలో ఉంచుకొని తగిన పోలీసు బందోబస్తుతో బ్యారికేడ్లను ఉంచడం జరిగిందన్నారు. అయిన కూడా కొంతమంది అల్లరి మూకలు దౌర్జన్యంగా పుంగనూరులోకి ప్రవేశించాలని వాగ్వాదానికి దిగారన్నారు. కొంతమంది అల్లరిమూకలు ముందుగానే తెచ్చుకున్న బీర్ బాటిల్స్, కర్రలు, రాళ్ళతో పోలీసుల పైకి దాడికి పాల్పడ్డారని తెలిపారు. సుమారు 2వేల మంది అల్లరి మూకలు చాలా అమానవీయంగా దాడి చేశారు. ముందస్తు ప్రణాళికలో భాగంగానే పోలీసులపై దాడులు జరిగాయి. వారిని అడ్డుకునే క్రమంలో మొదటగా బాష్ప వాయువు ప్రయోగించి వారిపై స్వల్ప లాఠీఛార్జీ చేయడం జరిగింది. లాఠీ ఛార్జ్ చేసినప్పటికీ అల్లరి మూకలు ఏమాత్రం తగ్గకుండా పోలీసులపై ఇష్టమొచ్చినట్టు విచక్షణా రహితంగా కర్రలు, రాళ్ళతో దాడిచేసి పోలీసు వారిని తీవ్రంగా గాయపరిచారు. 30మంది పోలీసులు రాళ్ల దాడిలో గాయపడ్డారు. 13 మంది పోలీసు వారికి తీవ్రగాయాలయ్యాయి. ఇందులో ఒక కానిస్టేబుల్‌కు ఎడమ కన్నుకు గాయమవ్వగా అతని ఎడమ కన్ను చూపు మందగించిడం గమనార్హం. రెండు పోలీసు వాహానాలను ద్వంసం చేసి వాటికి నిప్పు పెట్టారు. ఈ చర్యలో భాగంగా ఇప్పటికే వీడియోల ద్వారా 40మందిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేసామని, ఇంకా దర్యాప్తు జరుగుతోందని ఎవరైతే ఈ అల్లర్లకు పాల్పడ్డారో అందరిని త్వరలో అరెస్ట్ చేస్తామని తెలిపారు. గాయాలైన పోలీసులను పుంగనూరు హాస్పిటల్ నుండి మెరుగైన చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామని ఈరోజు ఉదయం డి.ఐ.జి, ఎస్పీ ఆసుపత్రికి వెళ్లి వారిని పరామర్శించి గాయాలపాలైన వారికి అందరికి 10,000 రూపాయలను అందించి వారు త్వరగా కోలుకునే విధంగా మెరుగైన చికిత్స అందింస్తున్నట్లు తెలిపారు. పుంగనూరు అల్లర్లపై ఇప్పటి వరకు 40 మందిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపుతున్నట్లు చెప్పారు. ఏవన్ ముద్దాయిగా చల్లాబాబు పేరును ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశామన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిఐజి అమ్మిరెడ్డి

భూస్వాములకు భూములు కట్టబెడితే ఊరుకోం

వ్యకాసం జిల్లా కార్యదర్శి ఓబులరాజు

ప్రజాశక్తి- పలమనేరు: అసైన్డ్ భూములను భూస్వాములకు కట్టబెట్టడానికి తెచ్చిన ఆర్డినెన్సును గవర్నర్ ద్వారా రాష్ట్రప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చిందని, ఈ ఆర్డినెన్స్ పేదలకు దళితులకు గిరిజనులకు నష్టం జరుగుతుందని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ ఆర్డినెన్స్ వెంటనే రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబుల్‌రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిత్తూరు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పలమనేరు ఎంబీటీ రోడ్డులో ఆర్డినెన్స్ కాపీలను దగ్ధం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వం పేదలకు భూపంపిణీ చేసేందుకు వేసిన మంత్రి ధర్మానప్రసాద్రావు ఆధ్వర్యంలో వేసి కమిటీ భూములు పంచె పనికాకుండా ముంచే పని చేసిందని దుయ్యబట్టారు. జగన్ మోహ్మన్‌రెడికి ఓట్లేసి దళిత, గిరిజనులకు ఆయన మంచి గుణపాఠం చెప్పారని, ఇప్పటికైనా దళిత, గిరిజనులు ఈ ప్రభుత్వ మోసాన్ని అర్థం చేసుకొని రాబోవు బుద్ధిచెప్పాలన్నారు. ఈకార్యక్రమంలో గంగవరం, పలమనేరు మండల వ్యవసాయ కార్మికసంఘం మండల కార్యదర్శిలు పాకాల సుబ్రహ్మణ్యం, గుర్రం సుబ్రమణ్యం, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గిరిధర్‌గుప్తా, వేణు, మొగిలప్ప, కొండప్ప, కృష్ణప్ప, తదితరులు పాల్గొన్నారు.



ఆర్డినెన్సు కాపీలను కాలుస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

గ్రామీణ ప్రాంతాల్లోనూ

క్రీడలపై ఉత్సాహం చూపేలా ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ రెండు నుంచి అత్యంత ప్రతిష్టాత్మకంగా సచివాలయ స్థాయి నుంచి జిల్లాస్థాయిలో వివిధ రకాల క్రీడలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఆడుదాం ఆంధ్ర కోసం మస్కట్ లోగోను ఉత్సాహం ఉన్నవారు ప్రతిపాదనలు పంపాలని, లోగోకు సంబంధించి రాష్ట్రస్థాయిలో పరిశీలించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జాతిపిత మహాత్మా గాంధీ పుట్టినరోజు అయిన అక్టోబర్ రెండు నుంచి 45 రోజులపాటు సచివాలయాలు, మండలాలు, నియోజకవర్గం, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలలో వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడీ, క్రికెట్ క్రీడలను నిర్వహించాలని భావించింది. ఇందుకు సంబంధించి చిత్తూరు జిల్లాలో పలు సంస్థల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. దీనికి సంబంధించిన మస్కట్ లోగో రాష్ట్రస్థాయిలో ఏర్పాటు చేయనున్నారు. ఉత్సాహం ఉన్న వారు ఈ లోగోను తయారుచేసి ఈనెల 10లోపున www.aadudhamandhra.comకు పంపాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఎంపికైన లోగోకు సంబంధించి బహుమతి ఉంటుందని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

యోగాలో వెదురుకుప్పం వాసి డిప్లొమా



సర్టిఫికెట్ అందుకుంటున్న కుమార్ రాజు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండల పరిధిలోని మారేపల్లి గ్రామ మాజీ సర్పంచి బండి కృష్ణారెడ్డి కుమారుడు బండి కుమార్ రాజు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వారి నేతాజీసుభాష్ చంద్ర బోస్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్, పాటియాల, పంజాబ్ వారు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఆరు వారాల డిపమా ఇన్ యోగా కోర్సుకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుండి అర్హత సాధించి ఏ గ్రేడ్‌లో ఉత్తీర్ణత సాధించి జాతీయస్థాయి యోగా కోచ్‌గా అర్హతపొందారు. దీనికి సంబంధించి సర్టిఫికెట్ యన్ఐఎస్ యోగా చీఫ్ కోచ్ డా.చంద్రకాంత మిశ్రా శనివారం అందించారు. అంతే కాకుండా ఈ మధ్యనే తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీలో కూడా యోగాలో డాక్టరేట్ కి అర్హత సాధించినట్లు తెలిపారు. ప్రస్తుతం తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, చిత్తూరులోని పి.వి.కె.యన్, కళాశాలలో అతిథి అధ్యాపకుడుగా పనిచేస్తున్నారు. గ్రామస్థాయి నుండి అర్హత సాధించినందుకు కళాశాల ప్రిన్సిపల్, డిపార్టుమెంటు హెడ్, అధ్యాపకులు, గ్రామస్తులు, యోగా అసోసియేషన్స్ సభ్యులు, ఏడీపై స్కూల్ డైరెక్టర్ ప్రనిత్, నారాయణ విద్యా సంస్థల డిజియం కొండలరావు, ఎజియం కిశోర్, ప్రిన్సిపల్, యంఎన్ఆర్ స్కూల్ అధినేత నాగరాజు, స్నేహితులు అభినందనలు తెలియజేశారు.

నేడు ఏపీ ఎన్జీవో సంఘ సమావేశం

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు ఎన్జీవో హోంలో ఆదివారం ఉదయం 10.30 గంటలకు పలమనేరు తాలూకా పరిధిలో పనిచేస్తున్న వివిధ శాఖల ఉద్యోగులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం తాలూకా అధ్యక్షుడు ఆనందబాబు, కార్యదర్శి జయమ్మ శనివారం తెలిపారు. ఈ నెల 21, 22 తేదీలలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటున్న, విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించు ఏపీఎన్జీవో సంఘం 21వ రాష్ట్ర మహా సభలలో పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొనే కార్యక్రమంతో పాటు అన్ని శాఖల ఉద్యోగుల సమస్యల పైన ఈ సమావేశంలో చర్చించనున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశానికి ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షులు కె.వి.రాఘవులు, జిల్లా కార్యదర్శి వి.జి.రఘు, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి యాదవ్, గ్రామ వార్డు సచివాయ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.హరి, జిల్లా అధ్యక్షుడు పి.రమణ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని వారు పేర్కొన్నారు.

వంట కార్మికులకు జీతాలు పెంచాలి



ఎంఈవోకు వినతిపత్రం అందిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ప్రజాశక్తి-నగరి: ప్రభుత్వ పాఠశాల వంట కార్మికులకు జీతాలు పెంచాలని, జగనన్న గోరుముద్ద మెనూ ప్రకారం అనుసరించాలంటే మెస్ ఛార్జీలు పెంపునకు ప్రత్యక్ష పోరాటానికి మహిళా కార్మికులు సన్నద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య శనివారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నగరి మండల పరిధిలోని మధ్యాహ్న భోజనం వర్కర్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నగరి ఎంఈఓకి ఆయన వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి మిడ్ డే మీల్స్ మండల నాయకులు కృష్ణవేణి అధ్యక్షత నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నగరి నియోజకవర్గ మధ్యాహ్న భోజన పథకం ఏఐటీయూసీ అనుబంధ సంఘం మండల కార్యదర్శి జమున, అధ్యక్షులు కృష్ణ వేణి, మహాలక్ష్మి, వేణి, కుప్పమ్మ, మల్లీశ్వరి, మహిళ కార్మికులు పాల్గొన్నారు.

7న జరిగే ధర్నాను జయప్రదం చేయండి



సమావేశంలో పాల్గొన్న ఆశా వర్కర్లు

ప్రజాశక్తి-నగరి: ఆశా కార్యకర్తలకు జీతాలు పెంచి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పని భారం తగ్గించి వేతనాలతో కూడిన సెలవులను ప్రకటించాలని కోరుతూ ఈనెల 7వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కోదండయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుజాత, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గీతా చందార్రై కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుజాత, ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు చందామరి, గీత, కోశాధికారి మాధవి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

తిరుచానూరులో వైద్యసేవలు



ప్రజాశక్తి-తిరుచానూరు: తిరుచానూరులో శనివారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సూచనల మేరకు తిరుపతి రూరల్ మండల అధ్యక్షులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఎమ్మెల్యే సతీమణి లక్ష్మీ తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ రామచంద్రారెడ్డి, నాయకులు మునీంద్ర రాయల్, చంద్ర, ఎంపీటీసీ నరేష్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, వాసు, వెంకటేష్, యోగా, ఆర్ఐ శివకుమార్, పంచాయతీ కార్యదర్శి శివశంకర్‌రాజు, వీఆర్వో మల్లికార్జున్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పునరుద్ధరణ



ప్రజాశక్తి-ఏర్పేడు: జంగాలపల్లి గ్రామంలో గత కొద్దిరోజులుగా చేతి బోరు పనిచేయకపోవడంతో సర్పంచ్ నారాయణ స్పందించి శనివారం మెకానిక్ ను పిలిపించి తన సొంత నిధులతో మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, చెన్నమ్మ, బోరు మెకానిక్ మునెయ్య, జంగాలపల్లి యూత్ పాల్గొన్నారు.

'చంద్రబాబు రెచ్చగొట్టి విధ్వంసం సృష్టించాడు'



మాట్లాడుతున్న ముడా ఛైర్మన్ వెంకట్ రెడ్డి యాదవ్

ప్రజాశక్తి-పుంగనూరు: ప్రశాంతంగా ఉన్న పుంగనూరులో చంద్రబాబు రెచ్చగొట్టి విధ్వంసం సృష్టించారని ముడా ఛైర్మన్ వెంకట్ రెడ్డి యాదవ్ ఉన్నారు. శనివారం చిత్తూరు జిల్లా వైసీపీ ఇచ్చిన బంద్ పిలుపుమేరకు పుంగనూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. 14 సంవత్సరాలు సీఎంగా, 40 సంవత్సరాలు రాజకీయం అనుభవం ఉన్న చంద్రబాబు నాయుడు వారి కార్యకర్తలను, నాయకులను, గూండాలను రెచ్చగొట్టి పదేపదే ప్రజాస్వామ్యం అని చెప్పే చంద్రబాబు నాయుడు ప్రజాస్వామ్యం ఖూనీ చేశారని ఆరోపించారు. చట్టాన్ని చేతిలోకి తీసుకుని చట్టంపై దాడి చేసి పోలీసులను గాయపరచడం వారందరినీ ఇబ్బంది పెట్టడం దారుణమని అన్నారు. చంద్రబాబు కుటిల రాజకీయాలు ప్రజలకు తెలుసు అన్నారు. మన ప్రాంతంలో 30 సంవత్సరాలు అధికారంలో ఉండి ఎలాంటి అభివృద్ధి అయినా చేశారా అని ఆయన ప్రశ్నించారు. నాలుగేళ్లుగా మన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేసిన అభివృద్ధి మనకందరికీ తెలుసు అన్నారు. రైతులకు ప్రజలకు తాగునీరు, సాగునీరు అందివ్వాలని సదుద్దేశంతో ప్రాజెక్టులు చేపడితే వాటిని గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టుకెళ్లి పనులను నిలిపివేశారన్నారు. వాస్తవానికి చంద్రబాబు నాయుడు పర్యటన రూట్ మ్యాప్‌లో పుంగనూరుకు లేకుండా బైపాస్ రోడ్డు పైన వెళ్లే విధంగానే ఉంది. అందులో భాగంగానే పోలీసులు పట్టణంలో రాకుండా బ్యారికేడ్లను ఏర్పాటు చేశారు. టిడిపి నేతలు ముందస్తు ప్రణాళికలతోనే రాళ్లు, కర్రలు ,బీరు బాటిల్లు తెచ్చుకొని పోలీసుల పైకి తెగబడ్డారు. రాబోయే కాలంలో తెలుగుదేశం పార్టీకి ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు.

'కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు'



కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

ప్రజాశక్తి-నగరి: రాష్ట్రంలో సాగు, తాగునీటి ప్రాజెక్టుల పరిశీలనకు ప్రతిపక్ష నాయకుడు హోదాలో చిత్తూరు జిల్లా పర్యటన విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుపై వైసిపి రౌడీలు దాడులకు తెగబడడం ఎంతవరకు సమంజసమని నగిరి పట్టణ టిడిపి అధ్యక్షుడు రమేష్ బాబు శనివారం ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక వైసిపి నాయకులు టిడిపి నాయకులపై దాడి చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ దాడులకు ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన వాపోయారు. చిత్తూరు జిల్లా, మదనపల్లి, కడపలో చంద్రబాబు నాయుడు పర్యటనకు వస్తే వైసిపి నాయకులు దాడులకు తెగబడడం చూస్తుంటే చంద్రబాబు నాయుడుకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక వైసిపి గుండాలు దాడులకు తెగబడుతున్నారన్నారు. ప్రతిపక్ష నాయకుడు హోదాలో చంద్రబాబు నాయుడు సాగునీటి ప్రాజెక్టుల పరిశీలనకు పోలీసులు అనుమతి కావాలన్న పోలీసులు అదే వైసిపి నాయకులు బందుకు పిలుపునిస్తే పోలీస్ అధికార యంత్రాంగం ఎలా అనుమతించిందని ఆయన ప్రశ్నించారు. అధికార వైసిపి నాయకులకు ఒక న్యాయం, టిడిపి నాయకులకు ఒక న్యాయమా అని అన్నారు. జరుగుతున్న పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రాష్ట్రానికి కాబోయే సీఎం చంద్రబాబు అని అభివర్ణించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టిఎన్‌టియుసి జ్యోతి నాయుడు, మాజీ దేశమ్మ గుడి ఛైర్మన్ కృష్ణా రెడ్డి, రొక్కం బాలాజీ, స్టేట్ టిఎన్‌టియుసి బాలాజీ, శ్రీధర్, శ్రీనివాసులు, ధనుంజయ రాజు పాల్గొన్నారు.

సైకిల్ యాత్రకు విశేష స్పందన



సైకిల్ యాత్రలో పాల్గొన్న టీడీపీ నాయకులు

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలో గత రెండు రోజుల నుండి కుప్పం నియోజకవర్గ తెలుగు యువత సభ్యులు నిర్వహిస్తున్న యువ సైకిల్ యాత్ర శంఖారావం కార్యక్రమానికి గ్రామ గ్రామాన ప్రజలు పెద్ద ఎత్తున జన నీరాజనాలు పలుకుతున్నారు. శనివారం అత్తికుప్పం, మణింద్రం, చింతకుప్పం, ఆవులకుప్పం, ముద్దనపల్లి, బిరుగుండ్లపల్లి గ్రామాల్లో సైకిల్ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో పార్టీ నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార పార్టీ నేతలు రోజుకో అబద్ధాలు మాట్లాడుతూ, గ్లోబల్ ప్రచారాల ద్వారా ప్రజలను మభ్యపెట్టి ప్రతిపక్షాల మీద బురద చల్లాలని చూస్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. రాష్ట్రంలో పాలనా యంత్రాంగమంతా అవినీతి మయమై తప్పు చేసిన అధికారులందరూ కోర్టుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని, రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా పవనాలు వీస్తున్నాయని, 2024 సంవత్సరంలో జరిగే ఎన్నికల్లో వైసీపీ గల్లంతవ్వడం ఖాయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో మళ్లీ అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరగాలంటే బాబు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చంద్రబాబు నాయుడు కార్యదర్శి మనోహర్, మునుస్వామి, ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, సత్యంద్ర శేఖర్, త్రిలోక్, కన్నన్, బాబునాయుడు, సుబ్రీ, బాలు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జల్లికట్టు

ప్రజాశక్తి-యాదమరి: మండలంలోని కొట్టాలం గ్రామ వీధుల్లో జల్లికట్టు గ్రామస్తులు ఘనంగా శనివారం నిర్వహించారు. కొట్టాలం గ్రామం తమిళనాడు సరిహద్దు ప్రాంతం కావడంతో తమిళనాడు రాష్ట్రంలోని గుడియాత్తం, లతేరి, పనుమడిగి, పల్లతుతూరు, పరదరామి గ్రామాల నుంచి అధిక సంఖ్యలో జల్లికట్టుకు పెద్ద ఎత్తున కోడెగిత్తలను పందెంకు తీసుకొచ్చారు. జల్లికట్టులో కోడెగిత్తలు రంకెలేస్తూ పరిగెత్తుతుంటే యువత పెద్ద సంఖ్యలో వాటిని నిలువరించేందుకు ఉత్సాహం చూపారు. దీంతో ఎక్కువ సంఖ్యలో రక్త గాయాలు పాలయ్యారు. కోటాల గ్రామంలో పరుగు పందెంలో గెలిచిన ఎద్దులకు మొదటి బహుమతిగా పూతలపట్టు నియోజకవర్గం ఎమ్మెల్యే ఎంఎస్ బాబు రూ.లక్ష, రెండవ బహుమతి జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ బి ధనంజయ రెడ్డి రూ.81 వేలు, మూడో బహుమతి జ్యోతి రెడ్డి రూ.61 వేలు, నాలుగవ బహుమతి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు సురేష్ బాబు రూ.55 వేలు, అలాగే గ్రామస్తులు ఎద్దుల పరుగు పందాలు గెలుపొందిన విజేతలకు 52 బహుమతులు నగదు రూపంలో ప్రకటించారు. కొట్టాల గ్గామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిహెచ్ఓ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో గాయాల తగిలిన వారికి వెంటనే ప్రథమ చికిత్స చేసి వారికి మందులు మాత్రలు అందించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా యాదమరి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



కోడెగిత్తను పట్టుకునేందుకు పరిగెడుతున్న ప్రజలు

7న తిరుపతిలో ఓబీసీ మహాసంఘ్



మాట్లాడుతున్న బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జ్ఞానజగదీష్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఓబీసీల సమస్యలపై చర్చించేందుకు ఈనెల ఏడో తేదీ తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ఓబిసి మహాసంఘ్ నిర్వహిస్తున్నట్లు బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జ్ఞానజగదీష్ తెలిపారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఓబిసీలు ఎదుర్కొంటున్న సమస్యలు చర్చించి కార్యచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. జాతీయస్థాయి సమావేశానికి దేశంలోని అనేక రాష్ట్రలకు చెందిన బీసి ముఖ్యనాయకులు పాల్గొనున్నట్లు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుండీ పెద్దసంఖ్యలో బీసీలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కులగణన జర పాలని, జనాభా ప్రతిపదికన చట్టసభలు, ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించాలని కోరారు.

సర్వేరాళ్లు నాటే కార్యక్రమం వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: వివిధ మండలాలలో ఉన్న వివిధ కేసులకు సంబంధించి వివరాలు నాలుగు రోజులలో ఇవ్వాలని, రీసర్వే కార్యక్రమంలో వివిధ దశలను వేగవంతంగా నిర్వహించాలని, అదేవిధంగా సర్వే రాళ్ళు నాటే కార్యక్రమం మరింత వేగవంతంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. శనివారం జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహాశీల్దార్లు, ఎంపీడీవోలు సర్వే అధికారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ పూర్తిగా పొందుపరిచి తయారు చేయాలని ఇంతవరకు ఉన్న కేసులు, కోర్టు తీర్పులు అమలు పరిచినవి పెండింగ్లో ఉన్నవి తెలిసేలా చూడాలని అన్నారు. రెండవ దశలో 105 గ్రామాలకు సంబంధించి రీసర్వే కార్యక్రమం నిర్వహించబడుతోందని ఈ నెలాఖరు లోపల ఈకార్యక్రమం ముగించాల్సి ఉందని, 29 గ్రామాల్లో జరుగుతున్న వివిధ దశలలో రీసర్వే పనులు వేగవంతం చేయాలన్నారు. ఫైనల్ ఆర్ఓఆర్‌తో సంబంధం లేకుండా ప్రభుత్వ భూములు, గ్రామ సరిహద్దులలో సర్వే రాళ్లు నాటే కార్యక్రమం పూర్తిచేయాలని ఆర్ఓఆర్ విడుదల చేసిన తర్వాత మిగతా కార్యక్రమాలను వేగవంతంగా సెప్టెంబర్ 15నాటికల్లా పూర్తి చేయాలని అన్నారు. గృహ నిర్మాణాలకు సంబంధించి ఓటిఎస్ పథకంలో ఇంకా పెండింగ్‌లో ఉన్న వాటికి సంబంధించి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ రెండు రోజులలో ముగించాలని అన్నారు. అసైన్మెంట్ భూములకు సంబంధించి లబ్దిదారులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పట్టాదారు పాసుపుస్తకాలు, భూహక్కు పత్రాలు, ఆన్లైన్లో ఎల్పిఎం ముఖ్యమంత్రి సందేశంలకు సంబంధించి పూర్తి ఏర్పాట్లు చేయాలన్నారు. 11 మండలాలకు సంబంధించి ప్రతిపాదనలు రావడం జరిగిందని, మరో 12మండలాలకు సంబంధించి వెంటనే ప్రతిపాదనలు పంపాలన్నారు. ఓటర్ల నమోదు చేర్పులు మార్పులు ప్రక్రియ వేగవంతం చేయాలని బిఎల్వోలు బిఎల్ఏలను తీసుకెళ్లి ఈ ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణయించిన గడువు లోపల ముగిసేలా చూడాలని అన్నారు. డిఆర్ఓ రాజశేఖర్, ఆర్డీవోలు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేయండి: జెసి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆజాధికా అమృత మహోత్సవ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించుదామని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం జెసి బంగ్లా నుండి ఎమ్మెస్ టీం కాన్ఫరెన్స్ ద్వారా జడ్పీ సీఈవో డిఆర్డిఏ డోమా పిడిలు జిల్లా పంచాయితీ అధికారులతో ఈ నెల 9 నుండి 16వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించే నా భూమి- నా దేశం కార్యక్రమంపై కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా జెసి మాట్లాడుతూ ఈనెల 9 నుండి 16వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నా భూమి - నా దేశం, నేల తల్లికి నమస్కారం- వీరులకు వందనం అజాది కా అమత మహోత్సవం వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహినిద్దామని సంబంధిత అధికారులకు సూచించారు. ఈకార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలోనూ మండల స్థాయిలో ప్రధాన కార్యాలయం దగ్గర అన్ని పట్టణ ప్రాంతాలలో ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి, డిపిఓ లక్ష్మి, డ్రామా డిఆర్డిఏ పీడీలు గంగా భవాని, తులసి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్

ప్రజాశక్తి-చౌడేపల్లి: పుంగనూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా ఎం.కృష్ణారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. హిందూపురం నుండి బదిలీపై పుంగనూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా వచ్చినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ లా అండ్ ఆర్డర్ విషయంలో రాజీ లేకుండా పని చేస్తానన్నారు. ప్రజల కోసమే తాము పనిచేస్తున్నట్లు తెలియజేశారు.

జీతాలు మంజూరు చేయాలి



నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఉపాధ్యాయులకు జీతాలు మంజూరు చేయాలని ఏపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి నవీన్ అన్నారు. శనివారం తహాశీల్దార్ కార్యాలయ ఆవరణంలో నిరసన వ్యక్తం చేసే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బదిలీల్లో వచ్చిన ఉపాధ్యాయులకు జీతాలు మంజూరు చేయడంలో ఆలస్యం అవుతున్నదని దీనిపై తగు చర్యలు తీసుకుని జీతాలు మంజూరు చేసే విధంగా చూడాలని తహాశీల్దార్ బెన్‌రాజ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళి, శేఖర్, శంకర్, వాసు, సాగర్, మార్కొండయ్య, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంటలపై అవగాహన



పంట పొలాల్లో విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-పలమనేరు: ఎంపిపి పాఠశాల విద్యార్థులు నో బ్యాగ్ డే సందర్భంగా సాంబారుపూరులో క్షేత్ర స్థాయిలో వివిధ రకాల పంటలను ఉపాధ్యాయులతో కలిసి శనివారం పరిశీలించారు. వరి పంటలలో వివిధ దశలను, వరినాట్లు వేసే విధానంపై అవగాహన, కిరణజన్య సంయోగక్రియను వివరించడం, పంటలను పండించడంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, సాధకబాధకాలను విద్యార్థులకు అర్థమయ్యేలా ప్రత్యక్ష పద్ధతిలో ప్రధానోపాధ్యాయులు హరిగోవిందయ్య, ఉపాధ్యాయ బృందం చూపించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గురుమూర్తి, గురునాధం గౌడు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనులవిందుగా కల్యాణోత్సవం

ప్రజాశక్తి-సోమల: సదుం మండలంలోని నడిగడ్డ గ్రామంలో వెలసిన శ్రీదేవి, భూదేవీ సమేత శ్రీ వేంటేశ్వరస్వామి కల్యాణోత్సవం శనివారం కన్నుల పండుగగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామి వారికి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లప్ప, జడ్పీటీసీ సోమశేఖర్ రెడ్డి, వైస్ సర్పంచ్ నాగభూషణ రెడ్డి, సురేంద్ర, మణి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆకాశాన్ని అంటుతున్న కూరగాయల ధరలు

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమలలో శనివారం నిర్వహించిన వారపు సంతలో కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటాయి. ఉదయం నుండి బంద్ వాతావరణంతో మధ్యాహ్నం రెండు గంటల వరకు సంత నిర్వహణకు నోచుకోలేదు. ఆపై సంత నిర్వహించగా కూరగాయలు, పూలు అధిక ధరలు పలికాయి. ఆడికృత్తిక పండుగ కారణంగా ప్రతి ఒక్కరూ పండుగకు నిత్యావసర సరుకులు తీసుకునేందుకు భారీగా వారపు సంతకు తరలివచ్చారు. అయితే ధరల మంట కారణంగా పేదవారు అరాకొరా నిత్యావసర సరుకులు కొనుగోలు చేశారు. ఏ కూరగాయ కొందామన్న కిలో వంద రూపాయలు పై మాటే ఉండటంతో పలువురు తక్కువ రకాలను కొనుగోలు చేశారు.



వారపు సంతలో రద్దీగా ఉన్న ప్రజలు

నాటు బాంబు పేలి శునకం మృతి



మృతిచెందిన శునకం

ప్రజాశక్తి-చౌడేపల్లి: నాటు బాంబు పేలి శునకం మృతి చెందిన సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. ఏ. కొత్తకోట, ఎస్ అగ్రహారం సమీపంలోని పాపిశెట్టిపల్లి వద్ద ఉన్న పెద్ద గుట్ట చిన్న చెరువుకు ఆనుకొని ఉన్న మునీంద్ర ఆదినారాయణకు చెందిన పంట పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తులు వన్యప్రాణుల కోసం నాటు బాంబులు అమర్చారు. విషయం తెలియని రైతులు పొలంలో పనులు చేసుకుంటుండగా వారి పెంపుడు కుక్క పొలంలో ఉన్న నాటుబాంబును కొరికింది. వెంటనే బాంబు పేలి శునకం అక్కడికక్కడే మృతి చెందగా, కూత వేటు దూరంలో ఉన్న నలుగురు రైతులకు, పాడి ఆవులకు ప్రమాదం తప్పింది. గుట్టకు సమీపంలో పంట పొలాలు ఉండటంతో గుర్తు తెలియని వ్యక్తులు వన్యప్రాణుల కోసం నాటు బాంబులు అమర్చడంతో ఈ ప్రమాదం సంభవించింది. పరిసర ప్రాంతాల్లో వేటగాళ్ళ అడవి జంతువుల కోసం నాటుబాంబులు అమర్చుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

విద్యార్థి గల్లంతు



గల్లంతైన విద్యార్థి సురేంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని మారేపల్లె మద్దెమాను ప్రాజెక్టులో విద్యార్థి గల్లంతైన సంఘటన చోటుచేసుకుంది. కడప నుంచి ప్రాజెక్టు వద్దకు అగ్రికల్చరల్ బీఎస్సీ ప్రాజెక్టు శిక్షణలో భాగంగా 45 మంది విద్యార్థులు శనివారం వచ్చారని సమాచారం. వీరిలో సుమారు 15 మంది సరదాగా ఈతకు వెళ్లారు. వారిలో ఒకరు మునిగి పోయారని సహచరులు తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు, పుత్తూరు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రాత్రి కావడంతో గాలింపు చర్యలకు ఇబ్బందిగా ఉందని పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

టిఫిన్ సెంటర్‌లో అగ్ని ప్రమాదం



టిఫిన్ సెంటర్‌లో ఎగిసిపడుతున్న మంటలు

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమల ఎంపీడీవో కార్యాలయ సమీపంలో అమరావతి అనే మహిళ టిఫిన్ సెంటర్‌లో శనివారం అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో పుంగనూరు అగ్నిమాపక సిబ్బంది సమాచారం తెలుసుకొని హుటాహుటిన సిబ్బందితో సంఘటనా స్థలానికి వచ్చి మంటలను అదుపుచేశారు. పుంగనూరు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు వివరాల మేరకు టెంకాయ కీతులతో నిర్మించిన టిఫిన్ సెంటర్‌లో గ్యాస్ సిలిండర్, హోటల్‌కు సంబంధించిన వస్తువులు అగ్నికి ఆహుతి అయ్యాయని, దాదాపు రూ.50 వేల నష్టం వాటిల్లి ఉంటుదని తెలిపారు. అజాగ్రత్త వల్ల ప్రమాదం సంభవించినట్టు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది సుమన్, సురేష్ బాబు, ఇమ్మానుయేల్, రఘుపతి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య




ఆత్మహత్య చేసుకున్న మురళి

ప్రజాశక్తి-నగరి: కడుపునొప్పి బాధతో మురళి (31) ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మాంగాడు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసంతి తెలిపిన వివరాల మేరకు.. మురళి అవివాహితుడు. గత కొంత కాలంగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నాడు. శుక్రవారం ఈ సమస్యతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నొప్పి తగ్గలేదన్న బాధతో శనివారం మాంగాడు చెరువుకట్టపై ఉన్న చెట్టుకు ఉరివేసుకొని మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

చేనేత వస్త్రాలు ధరిద్దాం

ప్రజాశక్తి-నగరి: స్వదేశీ ఉద్యమం 1905 ఆగస్టు 7వ తేదీన మొదలైందని అందుకు గౌరవ సూచికంగా అన్ని ప్రభుత్వ కార్యాలయ ఉద్యోగులు, పౌరులు, రాజకీయ నాయకులందరూ సోమవారం చేనేత వస్త్రాలు ధరించి కార్యాలయాలకు హాజరు కావాలని ఆర్డీవో సుజన శనివారం అన్నారు. ఈ మేరకు జిల్లా పాలనా అధికారులకు ఆర్డీవో ఆదేశాలు జారీ చేసినట్లు, ఆదేశాల అనుసారంగా అందరూ చేనేత వస్త్రాలు ధరించాలని ఆమె కోరారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ అలాగే అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజున "ఆడుదాం ఆంధ్రా" కార్యక్రమం మొదలు అవుతుందన్నారు. ఈ పోటీలకు సంబంధిత లోగో తయారు చేయడానికి ప్రభుత్వం అందరికీ అవకాశం కల్పించిందన్నారు. కావున విద్యార్థులు, పౌరులు, ఉత్సాహవంతులు లోగో తయారు చేసి డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు ఆడుదాంఆంధ్ర.కామ్ వెబ్‌సైట్‌లో అప్లోడ్ చెయ్యాలన్నారు. ఇలా అప్లోడ్ చేసిన ఉత్తమ లోగోలను కమిటీ సభ్యులు పరిశీలించి చక్కటి లోగో తయారు చేసిన వారిని ఎంపిక చేసి తగు బహుమతి ఇవ్వబడుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోడ్డు సమస్య పరిష్కారం



రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి-నగరి: మున్సిపల్ పరిధిలోని రామ్‌నగర్ సి లో రోడ్డు సమస్య పరిష్కారమైందని స్థానికులు శనివారం తెలిపారు. మంత్రి ఆర్కేరోజా ఈ ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సమయంలో స్థానికులు రోడ్డు, కల్వర్టు సమస్యను ఆమె దష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన ఆమె రోడ్డు, కల్వర్టుల నిర్మాణాన్ని చేపట్టాలంటూ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. వెంటనే ఎస్టిమేట్లు వేసుకున్న అధికారులు గడప గడపకు నిధుల ద్వారా రోడ్డు, కల్వర్టు నిర్మాణాలు ప్రారంభించి వేగంగా పూర్తిచేస్తున్నారు. శనివారం పనులను మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. మంత్రి ఆదేశాలతో విడుదలైన గడపగడపకు నిధులు రూ.లక్ష వ్యయంతో కల్వర్టు, రూ.7.45 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. త్వరలో రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో డీఈ నరేష్, ఏఈ రమేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.